క్లుప్తంగా

77 మీటర్ల జాతీయ పతాకంతో తిరంగా ర్యాలీ



నందిగామ: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలు విద్యాసంస్థల విద్యార్థులతో సోమవారం నందిగామ పట్టణంలో భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. 77 వ స్వాతంత్ర దిన వేడుకలను పురస్కరించుకొని 77 మీటర్ల జాతీయ పతాకంతో పట్టణంలోని అన్ని ప్రధాన వీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రసన్నకుమార్, సోమేశ్వరరావు, గోపి నాయక్, జాహిద, కటారపు గోపాల్, లాల్ సలాం తదితరులు పాల్గొన్నారు.

నేడు 150 అడుగుల జాతీయ జెండా ఏర్పాటుకు శంకుస్థాపన

జగ్గయ్యపేటఅర్బన్: 77 వ స్వాతంత్ర్య దినోత్సవం పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక 31 వ వార్డు శాంతినగర్‌లో 150 అడుగుల జాతీయ జెండా ఏర్పాటుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే ఉదయభాను నివాసం నుంచి బైక్ ర్యాలీ మొదలై ముందుగా రంగస్వామి బజారు, విలియంపేట, బాలికల పాఠశాల, మంగలి బజారు, క్రిస్టియన్‌పేట, సత్యనారాయణపురం, బాలుర హైస్కూల్, తహసీల్దార్ కార్యాలయం, జామియా మసీదు, రైతుబజారు, ప్రభుత్వాస్పత్రి, మున్సిపల్ కార్యాలయం, విద్యానగర్, మార్కెట్ యార్డులో జరిగే జెండా వందన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

తప్పులు లేని ఓటరు జాబితా తయారు

కంచికచర్ల: ఓటరు ధ్రువీకరణ కార్యక్రమానికి గ్రామాల్లోని అన్ని రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని తహసీల్దార్ పబ్బూరి శంకర బాబు కోరారు. మండలంలోని గండేపల్లి, కీసర, మండలకేంద్రమైన కంచికచర్ల గ్రామాల్లో సోమవారం ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని బీఎల్ఓలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపడుతున్నామని అన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలనే తలంపుతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.

ఆలయానికి రూ.50 వేల విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయానికి సోమవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడెం పట్టణానికి చెందిన గొంగటి పెద్దిరెడ్డి, అమృతమ్మ దంపతులు రూ.50 వేల విరాళాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్లు జంగం ప్రసాద్, బద్దుల కృష్ణమోహన్ చేతుల మీదుగా అందజేశారు. విరాళం నగదులో రూ.25 వేలు నిత్యాన్నదాన పథకానికి, రూ.25 వేలు గోశాలలో గోవుల సంరక్షణకు వినియోగించాలని దాతలు కోరారు. అనంతరం ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

విద్యార్థులకు ఉచితంగా బస్‌పాసుల పంపిణీ



గంద్రాయి(జగ్గయ్యపేట): గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విమలాభాను ఫౌండేషన్ ద్వారా 50 మంది పేద విద్యార్థులకు సోమవారం ఫౌండేషన్ చైర్‌పర్సన్ సామినేని విమల ఉచిత బస్సు పాసులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి లూర్దుమేరి, ఆర్టీసీ డీఎం రఘురాం, హెచ్ఎం సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలను స్మరించుకుందాం

పెనుగంచిప్రోలు: స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. 'నా భూమి–నాదేశం–వీరులకు వందనం' ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా సోమవారం అనిగండ్లపాడు, తోటచర్ల, శివాపురం, గుమ్మడిదూర్రు పాఠశాలల్లో శిలాఫలకాల ఆవిష్కరణ, ప్రతిజ్ఞ, మొక్కలు నాటటం, కొవ్వొత్తులు వెలిగించటం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అనిగండ్లపాడు, తోటచర్ల, గుమ్మడిదూర్రు సర్పంచ్‌లు బి.జ్యోతిబ్రహ్మం, కునగుంట్ల రాములమ్మ, నక్కా కమల, సొసైటీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు, వేముల శేషగిరిరావు, కూచి శ్రీనివాసరావు, శ్రీతిరుపతమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ లగడపాటి నాగేశ్వరరావు, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ జాన్‌మియా, ఏపీఓ తిరుపతయ్య, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో నడుద్దాం

పెనుగంచిప్రోలు: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం సాగించిన మహనీయుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని సర్పంచ్ గోనెల దేవి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో గ్రామంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో వైద్యాధికారి కె.వాణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయుల బాటలో నడుచుకోవాలి

కొత్తపేట(కంచికచర్ల): మండలంలోని కొత్తపేట గ్రామంలో సోమవారం నా భూమి– నా దేశం– వీరులకు వందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచి ప్రత్తిపాటి సునీత పాల్గొని మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల బాటలో ప్రతిఒక్కరూ నడుచుకోవాలన్నారు. అనంతరం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా కనకమ్మ కుంట వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి పంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. కొవ్వొత్తులు వెలిగించారు. అనంతరం మొక్కలు నాటారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మత గురువులతో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి ముప్పాళ్ల సత్యనారాయణ, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, ఎంఈఓ బి.బాలాజీ, ఏపీఓ రమాదేవి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



కంచికచర్ల మండలం కొత్తపేటలో శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

మక్కపేటలో మహాత్ముని పాదముద్రలు

వత్సవాయి: మహాత్మాగాంధీ మండలంలో మక్కపేట గ్రామంలో ఒక రోజు పర్యటించి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్య దిన వేడుకలను పురస్కరించుకుని గ్రామ ప్రజలు మరోమారు ఆ చారిత్రక సందర్భాలను గుర్తు చేసుకుంటున్నారు. 1929 ఏప్రిల్ 8న గాంధీ ఖద్దరు ఉద్యమంలో భాగంగా గ్రామానికి వచ్చారు. గాంధీజీ ఖమ్మం జిల్లా బోనకల్ వరకు రైలులో వచ్చారు. ఆయన వెంట భార్య కస్తూరిబాయితో పాటు ప్యారేలాల్ అనే వ్యక్తి కూడా వచ్చారు. వారికి స్వాగతం పలికి తీసుకురావడానికి అయ్యదేవర కాళేశ్వరరావుతోపాటు జయంతిపురం రాజా వెళ్లినట్లు చెబుతారు. గాంధీ, కస్తూరిబాయిని ఎద్దులబండిలో కూర్చోబెట్టుకుని మక్కపేట గ్రామానికి తోడ్కొని వచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ప్రధాన సెంటర్‌లో ఉన్న చౌతరాయి వేదికపై నిల్చొని గాంధీజీ ప్రజలనుద్దేశించి ప్రసంగించి వారిలో స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపారు. గ్రామస్తులు కలసి ఉద్యమ విరాళంగా 40 రూపాయలు పోగుచేసి బాపూజీకి అందించారు. అనంతరం ఆయన అక్కడ నుంచి జగ్గయ్యపేట, కొణకంచి గ్రామాలకు తరలివెళ్లారు. మహాత్ముడు ప్రసంగించిన చౌతరాయి వేదికకు గాంధీజీ కళావేదిక అని నామకరణం చేశారు. ఆయన మరణానంతరం గ్రామస్తులు ఆ వేదికపై గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు.



మక్కపేట ప్రధాన సెంటర్‌లో ఉన్న గాంధీజీ కళావేదిక

ఇంటింటికీ సంక్షేమాల వెల్లువ

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్రంలో ప్రతి ఇంటికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వెల్లువలా అందుతున్నాయని, దీంతో ప్రజలంతా చాలా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక 1 వ నంబరు సచివాలయం పరిధిలోని 1,2 వార్డుల్లో ఆంజనేయస్వామి వారి వీధి, యానాదుల కాలనీ, శివగంగ కాలనీ, ఎన్జీవో కాలనీలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వలంటీర్లు, స్థానిక నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయి, అందని వారి సమస్యలు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు లోవోల్టేజ్, డ్రెయిన్లు తదితర సమస్యలను వివరించారు. వెంటనే ఉదయభాను విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, స్థానిక కౌన్సిలర్ కొలగాని రాము, రాష్ట్ర పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబు, ఏఎంసీ డైరెక్టర్ పింగళి నరసింహారెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు చాపల వెంకటేశ్వర్లు, పట్టణ బీసీ విభాగం అధ్యక్షుడు గుంజ లక్ష్మణ్, పెనుగంచిప్రోలు మండల సచివాలయాల కన్వీనర్ శామ్యూల్, స్థానిక నాయకులు తిరుమలశెట్టి శ్రీనివాసరావు, గింజుపల్లి గోపి, భానుప్రకాష్, వల్లంకొండ రామారావు, బాబు, పఠాన్ సైదాఖాన్,ఎం.శివయ్య పాల్గొన్నారు.



పేటలోని 1,2 వార్డుల్లో సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

బాలిక భవిష్యత్తుకు భరోసా

లైంగిక దాడికి గురైన బాలిక, తల్లిదండ్రులకు ఎమ్మెల్సీ పరామర్శ

చింతలపాడు(నందిగామ టౌన్): బాలిక భవిష్యత్తుకు భరోసాగా ఉంటామని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉన్నత చదువులు చదువుకునేలా తమ వంతు సహకారం అందిస్తామని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ హామీ ఇచ్చారు. చందర్లపాడు మండలం చింతలపాడు గ్రామంలో లైంగికదాడికి గురైన బాలిక కుటుంబ సభ్యులను సోమవారం రాత్రి ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం మాట్లాడుతూ నిందితునికి కఠిన శిక్ష పడేలా పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. బాలికను రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. భవిష్యత్తులో ఉన్నత చదువులు చదువుకునేందుకు కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ వంతుగా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.

అమ్రితసాయిలో ప్రాంగణ ఎంపికలు

కంచికచర్ల: మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజనీరింగ్ కళాశాలలో చెన్నైకు చెందిన ప్రముఖ కంపెనీ కన్‌స్టెన్ గ్లోబల్ సొల్యూషన్ ప్రయివేట్ లిమిటెడ్ వారు ఇంటర్వ్యూలు నిర్వహించి ఆరుగురు విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నట్టు కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి బి.రామారావు సోమవారం తెలిపారు. వీరిలో ఒక విద్యార్థికి సాఫ్ట్‌వేర్ అనలిస్టుగా వార్షిక వేతనం రూ.12లక్షలు, మరో ఐదుగురికి వార్షిక వేతనం రూ.8.5 లక్షలుగా నిర్ణయించి నియామక పత్రాలు అందజేశారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ మాట్లాడుతూ, 2023–24 సంవత్సరంలో ఇప్పటివరకు 65 మందికి ఉద్యోగావకాశాలు వచ్చాయని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహన్‌రావు, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ పి.చిరంజీవి, హెచ్ఓడీ డి.పవన్‌కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

కళ్లకలక నివారణ మందుల పంపిణీ

కోనాయపాలెం(నందిగామ టౌన్): చందర్లపాడు మండలం కోనాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ప్రముఖ హోమియో వైద్యుడు భానుప్రసాద్ కళ్లకలకల నివారణ మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వాసిరెడ్డి ప్రసాద్, హెచ్ఎం నారాయణ పాల్గొన్నారు

సార్వత్రిక విద్యా పీఠం వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

జగ్గయ్యపేటఅర్బన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం, గుంటూరు వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ 2023–24 విద్యా సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలను కోరుతూ వాల్ పోస్టర్లు, కరపత్రాలను సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆవిష్కరించారు. ఏపీవోఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ నక్కా బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, కౌన్సిలర్ కొలగాని రాము, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

నందిగామ: కొణతమాత్మకూరు గ్రామానికి చెందిన కౌలు రైతు పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపిన సమాచారం ప్రకారం గ్రామానికి చెందిన గండేపల్లి బ్రహ్మయ్య (75) కొంతకాలంగా అయిదు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని ఆ పొలంలో పత్తి, మిర్చి, వరి పంటలను సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో అప్పులు చేశాడు. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతినడంతో చేసిన అప్పు ఎలా తీర్చాలా అన్న ఆందోళనతో ఆదివారం పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బ్రహ్మయ్య మృతి చెందాడని పోలీసులు తెలిపారు.

అంగన్‌వాడీలో ఖాళీ పోస్టుల భర్తీకి మౌఖిక పరీక్షలు

నందిగామ: డివిజన్‌లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టుల భర్తీకి స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఆర్డీఓ రవీంద్రరావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.ఉమాదేవితో పాటు పలు శాఖలకు చెందిన అధికారుల సమక్షంలో అభ్యర్థులకు మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ డివిజన్‌లో ఒక కార్యకర్త పోస్టుకు 9 మంది, 8 సహాయకురాలి పోస్టులకు 34 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిని ఇంటర్వ్యూ చేశామని తెలిపారు. సహాయకురాలి నుంచి కార్యకర్తగా ఉద్యోగోన్నతి పొందే 21 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవోలు లక్ష్మీ భార్గవి, భాగ్య రేణుక, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



అభ్యర్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న అధికారులు

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

నందిగామ: అర్జీల రూపంలో అందిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ రవీంద్రరావు తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి వివిధ సమస్యలపై నాలుగు అర్జీలు అందినట్టు ఆర్డీఓ తెలిపారు.



స్పందన ద్వారా అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీవో రవీంద్రరావు

దాచవరం సర్పంచ్ రేసులో ముగ్గురు

దాచవరం(వీరులపాడు): మండలంలోని దాచవరం గ్రామ సర్పంచ్ ఉప ఎన్నికకు ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఎన్నికల అధికారి మల్లెల ఝాన్సీరాణి తెలిపారు. నామినేషన్‌ల ఉప సంహరణ ప్రక్రియ సోమవారం ముగిసిన అనంతరం గద్దె వెంకటేశ్వర్లు, తోట రవిబాబు, కామిశెట్టి వెంకటేశ్వరరావు బరిలో ఉన్నారని ఆమె ప్రకటించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి గద్దె వెంకటేశ్వర్లుకు ఉంగరం గుర్తు కేటాయించగా, తోట రవిబాబుకు మంచం, కామిశెట్టి వెంకటేశ్వరరావుకు కత్తెర గుర్తు కేటాయించామన్నారు. దొడ్డదేవరపాడు ఆరో వార్డుకు అద్దంకి బేబి నామినేషన్ ఒక్కటే రావటంతో ఆమెను ఏకగ్రీవంగా ప్రకటించినట్లు తెలిపారు. జమ్మవరం ఎనిమిదవ వార్డు ఉప ఎన్నికకు బరిలో ఉన్న అభ్యర్థులు ఇడుపుపాటి కటాక్షంకు ప్రెషర్ కుక్కర్, మంగళపూడి కుమారికి గౌను గుర్తు కేటాయించినట్లు చెప్పారు.

దాచవరంలో సర్పంచ్ అభ్యర్థి ప్రచారం

దాచవరం(వీరులపాడు): గ్రామాభివృద్ధికి పాటుపడే వారికి అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి గద్దె వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని దాచవరం గ్రామంలో సోమవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఉంగరం గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామిశెట్టి రత్నప్రసాద్, తోట హరీష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



పెద్దమోదుగపల్లి సర్పంచ్ బరిలో ఇద్దరు

పెద్దమోదుగపల్లి(వత్సవాయి): మండలంలోని పెద్దమోదుగపల్లి సర్పంచ్ పదవికి ఈ నెల 19 న జరగనున్న ఎన్నికలలో ఇద్దరు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. గ్రామ సర్పంచ్‌గా పనిచేసిన కల్యాణం తేజశ్రీ , శింగవరం ఆరో వార్డు సభ్యురాలు ఇ.రాజేశ్వరిలు ఇటీవల చనిపోయారు. వారి స్థానంలో కొత్తవారిని ఎన్నుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. శింగవరం ఆరో వార్డు సభ్యురాలిగా చిందు విజయలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయింది. సర్పంచ్ బరిలో మాత్రం ఇద్దరు పోటీపడుతున్నారు. వారిలో కల్యాణం విజయలక్ష్మికి కత్తెర గుర్తు, నందమూరి మాధవికి మంచం గుర్తులను కేటాయించినట్లు ఎన్నికల అధికారి డి.బాబూరావు తెలిపారు. గ్రామంలో మొత్తం 865 ఓట్లు ఉండగా వారిలో మహిళలు 471 మంది, పురుషులు 394 మంది ఉన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నిక జరుగుతుందని, అనంతరం అదే రోజు ఓట్లు లెక్కించి గెలిచిన అభ్యర్థిని ప్రకటిస్తారని చెప్పారు.

తొర్రగుడిపాడు వార్డు మెంబర్ ఏకగ్రీవం

నందిగామ: మండలంలోని తొర్రగుడిపాడు 8 వ వార్డు ఎన్నిక ఏకగ్రీవమైందని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. గ్రామంలోని 8 వ వార్డుకు మూడు నామినేషన్లు రాగా వారిలో ఇద్దరు అభ్యర్థులు సోమవారం తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో మిగిలి ఉన్న ఏకైక అభ్యర్థి మోర్ల కల్పన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంపీడీవో ప్రకటించారు.

మల్కాపురం సర్పంచ్‌గా పుల్లారావు ఏకగ్రీవం

జగ్గయ్యపేట: మల్కాపురం సర్పంచ్, అనుమంచిపల్లి వార్డు సభ్యుని ఉప ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారులు నరసింహారావు, సిద్ధారెడ్డి సోమవారం తెలిపారు. మల్కాపురం సర్పంచ్‌గా ఆంబోజి పుల్లారావు (జాన్) ఒక్కరే నామినేషన్ వేయటంతో ఎన్నిక ఏకగ్రీవమైందన్నారు. అనుమంచిపల్లి నాలుగవ వార్డు అభ్యర్థిని కందిబండ వసంత నామినేషన్ ఒక్కటే రావటంతో ఏకగ్రీవమైనట్లు తెలిపారు.



బాల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకే ఇన్‌స్పైర్ మనక్

నందిగామటౌన్: విద్యార్థుల్లోని శాస్త్రీయ ప్రతిభను వెలికి తీసి వారిని బాల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దటమే ఇన్‌స్పైర్ మనక్ వైజ్ఞానిక ప్రదర్శన ముఖ్య ఉద్దేశమని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌స్పైర్ మనక్ అవార్డులపై సైన్స్ ఉపాధ్యాయులు సోమవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అరుణకుమార్ ఇన్‌స్పైర్ అవార్డు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలను రేకెత్తించి వారిని పరిశోధన వైపు మళ్లించేందుకు ఈ వైజ్ఞానిక ప్రదర్శన ఎంతో దోహదపడుతుందన్నారు. విద్యార్థుల ఆలోచనలకు పదును పెట్టి ప్రతిభ కనబర్చేలా సైన్స్ ఉపాధ్యాయులు తోడ్పాటునందించాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మన్నెం దాసు, హెచ్ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

శివాలయాల్లో మాసశివరాత్రి పూజలు

నందిగామ: మాస శివరాత్రి, సోమవారం కలిసి రావడంతో మండలంలోని పలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన కూడలి సంగమేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. పట్టణ శివారు పల్లగిరి గట్టుపై గల స్వయంభు శివలింగం వద్ద, మున్నేటి తీరాన గల విజ్ఞాన నందీశ్వర స్వామి వారి ఆలయంలో భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేశారు.

ఉదయభాను స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

జగ్గయ్యపేటఅర్బన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎందరో సమరయోధుల పోరాట ఫలితంగా సాధించుకున్న స్వాతంత్ర్యం ప్రతి ఒక్కరిలో దేశభక్తిని నింపే విధంగా స్ఫూర్తినిస్తుందని, భిన్నమైన కులాలు, మతాలు ఉన్నప్పటికీ మనమంతా భారతీయులమనే ఏకత్వంతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

